క్లుప్తంగా

వార్డు సచివాలయాల తనిఖీ



వీవర్స్ కాలనీ వార్డు సచివాలయంలో హాజరుపట్టీ పరిశీలిస్తున్న కమిషనర్

నరసాపురం: పట్టణంలోని వీవర్స్‌కాలనీ, కప్పలపేట వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య గురువారం తనిఖీ చేశారు. సచివాలయాల్లో ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సర్వర్లు సవ్యంగా పని చేస్తున్నాయన్నారు. ఉద్యోగులు ఉదయం సమయానికి కార్యాలయానికి వచ్చి విధులు నిర్వహించాలని చెప్పారు. ఉద్యోగులు హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆయన వెంట వివిధశాఖల మున్సిపల్ అధికారులు ఉన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు



రాజగోపాలస్వామి ఆలయంలో సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

మొగల్తూరు: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాల స్వామి వారి ఆలయంలో గురువారం సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సుదర్శనం లక్ష్మీ నరసింహాచార్యులు, రామశేషాచార్యులు, రమేష్ ఆచార్యులు ఆధ్వర్యంలో వ్రత పూజలు జరిపారు. గ్రామానికి చెందిన భక్తులు ఈ వ్రత పూజలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల మొదటి జాబితా సిద్ధం



పట్టభద్రుల ఓట్లు దరఖాస్తులను పరిశీలిస్తున రెవెన్యూ సిబ్బంది

మొగల్తూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల మొదటి జాబితాను అధికారులు ఆమోదించారని తహసీల్దార్ కె.రాజకిశోర్ గురువారం విలేకరులకు తెలిపారు. మండలంలని 17 గ్రామాలకు సంబంధించి 1696 దరఖాస్తులు రాగా మొదటి జాబితాలో 1416 మంది ఓటర్ల పేర్లు జాబితాలో నమోదు చేశామని స్పష్టం చేశారు. మిగిలిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, దరఖాస్తులతో పాటు ఇచ్చిన పత్రాలు సరిగ్గా ఉంటే ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నామని, ఏమైనా తేడాలుంటే సంబంధిత ఓటరుకు సమాచారం అందించి దరఖాస్తులను సరి చేస్తున్నామన్నారు. తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కేవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో బీఎల్‌ఓలు దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను చేపడుతున్నారని వివరించారు.

జాతీయ రహదారిపైనే వాహనాల పార్కింగ్



జాతీయ రహదారికి ఇరువైపులా నిలిపి ఉంచిన భారీ వాహనాలు

నరసాపురం: పట్టణంలో ఓఎన్జీసీ టెంపుల్ ల్యాండ్ వద్ద జాతీయరహదారి ఇరుకుచిక్కపోయి కనిపిస్తోంది. 216 జాతీయ రహదారికి ఇరువైపులా ఓఎన్జీసీకి చెందిన భారీ వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. దీంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. జాతీయరహదారి పక్కన రుస్తుంబాధ ప్రాంతంలో ఓఎన్జీసీ టెంపుల్‌ల్యాండ్ కార్యాలయం ఉంది. ఓఎన్జీసీకి సంబంధించిన సరుకుల రవాణా భారీ వాహనాలతో ప్రతిరోజూ ఇక్కడికి సాగుతుంది. అయితే వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారికి ఇరువైపులా నిలిపి ఉంచుతున్నారు. ఇటీవల కాలంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. దీంతో తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. పోలీసుశాఖ దృష్టి పెట్టి పరిస్థితి చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

పాలకొల్లు అర్బన్: మండలంలోని భగ్గేశ్వరంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న టి.త్రిమూర్తిరావును గురువారం పాలకొల్లు ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 9 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. త్రిమూర్తిరావును కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు తెలిపారు. నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గ్రామ సచివాలయాలు వెలవెల

- కుంటుపడుతున్న పాలన
- సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వ కుట్ర.
- ప్రభుత్వ సేవలందక గ్రామీణుల అవస్థలు



వేములదీవి వెస్ట్ సచివాలయం



వేములదీవి వెస్ట్ సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఒకే ఒక ఉద్యోగి

నరసాపురం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు సులభతరంగా అందించాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నీరుకార్చేలా చర్యలు తీసుకుంటుంది. ప్రజలు ఇబ్బందులుపడకుండా ప్రతిభా వంతులైన నిరుద్యోగులకు సచివాలయ ఉద్యోగాలు కల్పించడంతో పాటు పరిపాలనను ప్రజలను చేసేందుకు వలంటీర్లను కూడా నియమించారు. వీటి ద్వారా ప్రజలు, రైతులకు మెరుగైన సేవలు అందించారు. అయితే చంద్రబాబు ప్రభుత్వం వలంటీర్లను విధుల్లోకి తీసుకోకపోవడంతో ఆ పనులన్నీ సచివాలయ సిబ్బందే చేయాల్సి వస్తుంది.

ఒక్కో సచివాలయంలో 11 మంది ఉద్యోగులు

నరసాపురం మండలంలో 24 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఒక్కో సచివాలయంలో 11 మంది ఉద్యోగులు వరకూ పనిచేసే విధంగా గత ప్రభుత్వం నియమించింది. ప్రతి సచివాలయంలో గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శితో పాటు వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్, వ్యవసాయ, వెటర్నరీ, ఫిషరీస్, సర్వేయర్లు, వీఆర్వోలు అందుబాటులో ఉంటారు. ప్రతి సచివాలయంలో 545 సర్వీసులకు పైగా ప్రజలకు రైతులకు, విద్యార్థులకు సకాలంలో అందించి ఉద్యోగులు అందరి మన్ననలు పొందేవారు. గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకం ఇంటి వద్దకే అందించేవారు. ఏ పనైనా సరే అర్హత ఉంటే పార్టీలతో సంబంధం లేకుండానే మంజూరు చేశారు. దీంతో దళారీ వ్యవస్థ లేకుండా పోయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని క్రమంగా నిర్వీర్యం చేస్తోంది. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థ లేకుండా చేసింది. సచివాలయం ఉద్యోగులను కేవలం పింఛన్ల పంపిణీకే పరిమితం చేసి వ్యవస్థను దెబ్బతీసేలా వ్యవహరిస్తోంది.

ఎన్నో అవమానాలు

కూటమి నేతలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సచివాలయ ఉద్యోగులపై విపక్షతో అనేక విమర్శలు చేశారు. అవమానంగా మాట్లాడారు. నేడు కూటమి సర్కార్ పింఛన్లు పంపిణీకి సచివాలయ ఉద్యోగులే పెద్ద దిక్కయ్యారు. మొన్నటి నెలలో కూటమి ప్రభుత్వం చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో స్టిక్కర్లు అతికించడం దగ్గర నుంచి ఇంటింటి ప్రచారం వరకూ వీరినే ఉపయోగించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బ తీశారు. ప్రస్తుతం వీరందరి చేత ఇంటింటి సర్వే చేయిస్తున్నారు.

ఉద్యోగులు ఎక్కడ?

గత ప్రభుత్వం రెండు వేల జనాభా ఉన్న గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.21 లక్షలతో హెల్త్ సెంటర్‌లను ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందు వరకూ వివిధ సంక్షేమ పథకాలు అమలుతో ప్రజలు, లబ్ధిదారుల రాకపోకలతో కళకళలాడిన సచివాలయాలు నేడు వెలవెల బోతున్నాయి. ముఖ్యంగా వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసి వారి పని కూడా సచివాలయ సిబ్బందే చేయాలని మౌఖిక ఆదేశాలు ఇవ్వడంతో సచివాలయాలు ఉద్యోగులు లేక వెలవెల బోతున్నాయి. సచివాలయ సిబ్బంది బదిలీలకు ఇటీవల ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో తీర ప్రాంత నియోజకవర్గమైన నరసాపురం, మొగల్తూరు గ్రామాల నుంచి అనేక మంది సచివాలయ సిబ్బంది ఇక్కడి నుంచి మరొక సచివాలయాలకు బదిలీపై వెళ్లిపోయారు. ఉన్న కొద్దిమంది సిబ్బందే అన్ని పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సచివాలయ వ్యవస్థను పటిష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్సాహంగా కార్తీక వన సమారాధన



కార్తీక వన సమారాధనను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ కలిదిండి స్వర్ణ దంపతులు

మొగల్తూరు: కార్తీక మాసం నేపథ్యంలో లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో గురువారం వన సమారాదనను ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసంలో అందరూ కలిసి ఆ భగవంతుని సన్నిధిలో సామూహిక వనసామరాధనలో పాల్గొనడం మంచి శుభ కార్యక్రమమని బ్రహ్మకుమారీస్ తెలిపారు. మొగల్తూరులోని వడయార్‌పేటలోని వనమల్లికార్జున స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమాన్ని గ్రామ మాజీ సర్పంచ్ కలిదిండి స్వర్ణ, ఉపసర్పంచ్ కలిదిండి కుమార్ బాబులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మ కుమారీస్ సత్యనారాయణ, నాగేశ్వరరావు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ఆదూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు నరసాపురం కౌన్సిల్ సమావేశం

నరసాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం ఉదయం 11:30 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని స్పష్టం చేశారు. సభ్యులు విధిగా సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



పెనుగొండ: చెరుకువాడలో రైతులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ దాసి రాజు

పెనుగొండ: వాతావరణంలో మార్పులతో రైతులు అప్రమత్తంగా ఉంటూ అధికారులకు సహకరించాలని నరసాపురం ఆర్డీవో దాసిరాజు సూచించారు. గురువారం రాత్రి చెరుకువాడలో రైతుల కల్లాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కోతలు కోసిన రైతులు తేమ శాతంతో సంబంధం లేకుండా నేరుగా మిల్లులకు ధాన్యాన్ని పంపించుకోవాలన్నారు. ధాన్యాన్ని రాశులపై రక్షించడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. దళారుల వలలో చిక్కకుండా రైతు సేవా కేంద్రాలు ద్వారా ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. అనంతరం పెనుగొండలోని వెంకట సుబ్రహ్మణ్యం మిల్లును ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దారు జి.అనితకుమారి ఉన్నారు.

ఆగర్రులో..

పాలకొల్లు అర్బన్:ల ఫెంగల్ తుఫాన్ కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలను నాలుగు రోజులు వాయిదా వేసుకోవాలని ఆర్డీఓ దాసి రాజు సూచించారు. పాలకొల్లు మండలంలోని ఆగర్రులో గురువారం ధాన్యం మాసూళ్లు చేసుకుంటున్న రైతులతో ఆయన మాట్లాడారు. వాతావరణం అనుకూలంగా లేదని దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

యలమంచిలి: రాబోయే నాలుగు రోజులలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలో రైతులంతా నాలుగు రోజులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ కోరారు. వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి గురువారం ఆయన యలమంచిలి, ఊటాడ, కాజ తదితర గ్రామాలలో పర్యటించి కళ్లాలలో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి, ఆయా గ్రామాల వీఆర్‌ఓలు ఉన్నారు.

ఆక్వా యూనివర్సిటీ పనుల పరిశీలన



ఆక్వా యూనివర్సిటీ భవన నిర్మాణ ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

నరసాపురం రూరల్: మండలంలోని లిఖితపూడి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఆక్వా యూనివర్సిటీ పనులను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ గురువారం పరిశీలించారు. త్వరితగతిన భవన నిర్మాణ పనులు పూర్తి చేసి ఇసతపే విద్యార్థులకు మేలు కలుగుతుందన్నారు. ఇప్పటికే 2వ బ్యాచ్ తరగతులు ప్రారంభమయ్యాయని వారంతా ఇరుకు గదుల్లో విద్యాబ్యాసం చేస్తున్నారన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి యూనివర్సిటీ ప్రాంగణంలో ఆక్వా కళాశాల తరగతులు ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, బందెల రవీంద్ర, వలవల నాని తదితరులు ఉన్నారు.

1న కాపు, తెలగ కార్తీక వన సమారాధన



రుస్తుంబాదలో వనసమారాధన స్థలంలో కాపు నాయకులు

నరసాపురం రూరల్: కాపు, తెలగ కార్తీక వనసమారాధన డిసెంబర్ 1న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని సీతారాంపురం లేసుపార్కు పక్కన కొండవీటి వారి మామిడితోటలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు ఆ ప్రాంతంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి గురువారం విలేకరులకు వివరాలను తెలిపారు. వనసమారాధనకు కాపు నేతలు హాజరవుతారని, వారిని సన్మానిస్తామని పేర్కొన్నారు. పిల్లలు నుంచి పెద్దలు వరకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటుచేసామన్నారు. మహిళలకు ప్రత్యేకంగా పాటలు,ఆటలు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలిశెట్టి మధు, తమ్మిశెట్టి బాబ్జి, కావలి నాని, దాసరి శ్రీను, మేడిది రాము, శిరిగినీడి రాజ్యలక్ష్మి, చెన్నా లక్ష్మి, సుప్రజ, సలాది మణికర్ణిక తదితరులు పాల్గొన్నారు.

10న విజయవాడలో ఉద్యోగుల మహాసభ



తహసీల్దార్ కార్యాలయం వద్ద పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ వై.దుర్గాకిషోర్

పాలకొల్లు అర్బన్: సీపీఎస్ విధానం అమలు చేయడం వల్ల పదవీ విరమణ చేసిన ఎందరో ఉద్యోగులు పెన్షన్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు, తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్ ఆవేదన వ్యక్తం చేశారు. పాలకొల్లు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం సీపీఎస్ రద్దు కోరుతూ ఈ నెల 10న విజయవాడలో నిర్వహించ తలపెట్టిన ఉద్యోగుల మహాసభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఏపీఎన్‌జీవో పాలకొల్లు తాలుకా అధ్యక్షుడు గుడాల హరిబాబు, ఎన్జీవో నాయకులు ఎంఆర్‌కే రాజు, రాయుడు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, త్రినాథ్, సెక్రటరీసంఘ అధ్యక్షుడు బంగారు శివరామకృష్ణ పాల్గొన్నారు.

కువైట్‌లో దేవ గ్రామస్తుడి మృతి



గూనపాటి చినబాబు(40)

పెనుగొండ: పెనుగొండ మండలం దేవ గ్రామానికి చెందిన గూనపాటి చినబాబు(40) కువైట్‌లో గుండె పోటుతో మృతి చెందాడు. బుధవారం గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు బంధువులకు సమాచారం రావడంతో వారి కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. చినబాబుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృత దేహాన్ని కువైట్ నుంచి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆరు సంవత్సరాలుగా కువైట్‌లో జీవనోపాధికి వెళ్లి వస్తున్నాడు, మూడు నెలలు క్రితమే సెలవుపై స్వగ్రామానికి వచ్చి ఇటీవలే తిరిగి వెళ్లాడు. ఇంతలోనే మరణవార్త రావడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

పోలింగ్ కేంద్రం పరిశీలన

కాళ్ల: తూర్పు–పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కాళ్లలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ జి.సుందర్ సింగ్ పరిశీలించారు. మండలంలో మొత్తం 52 ఉపాధ్యాయ ఓట్లు ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్, తాగునీటి సౌకర్యం, ప్రహరీ, మరుగుదొడ్లు, తదితర వసతుల విషయమై పరిశీలించారు.

ఏఎస్‌ఎన్ఎం కళాశాలలో అభివృద్ధిపై జాతీయ సదస్సు

పాలకొల్లు సెంట్రల్: ఎంటర్ ప్రెన్యూర్‌షిప్, బిజినెస్ డెవలప్‌మెంట్ అనేది ఒక విజయవంతమైన వ్యాపారాన్ని ప్రారంభించడానికి, అభివృద్ధిచేయడానికి, వ్యాపార వెంచర్‌ను స్థాపించడానికి, వనరులు నిర్వహించడానికి ఉపయోగపడుతుందని రిసోర్స్ పర్సన్ ప్రొఫెసర్ ఎన్ ఉదయభాస్కర్ అన్నారు. స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి కళాశాలలో వాణిజ్య విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్లో భాగంగా వ్యవస్థాపకత అభివృద్ధిపై జాతీయ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, నన్నయ్య యూనివర్శిటీ ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరి దేవి, వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, ఐఐసీ ప్రెసిడెంట్ కె.భద్రాచలం, వైస్ ప్రెసిడెంట్, వాణిజ్య అధ్యాపకురాలు పి.దుర్గేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న ఆర్డీఓ దాసి రాజు

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. గురువారం పట్టణ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా దాసి రాజు మాట్లాడుతూ ఆసుపత్రిలో ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్ వార్డులను పరిశీలించామన్నారు. వైద్య సేవలు, భోజనం ఏర్పాట్లు, సిబ్బంది డబ్బులు వసూళ్ల చేస్తున్నారా? అంటూ ఆరా తీశామన్నారు. ప్రస్తుతం అన్ని సౌకర్యాలు బాగున్నాయని రోగులు తెలిపారన్నారు. ఆర్డీఓ వెంట మునిసిపల్ కమిషనర్ బి.విజయసారధి, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఒ.రవికుమార్ తదితరులు ఉన్నారు.

సీహెచ్‌సీలో వైద్యుడి ఖాళీ భర్తీ చేయాలి

పెనుగొండ: పెనుగొండ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎండీ స్థాయి వైద్యునిపుణుడు ఖాళీని సత్వరం భర్తీ చేయాలని సీపీఎం కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. గురువారం పెనుగొండ సీహెచ్‌సీ వద్ద ధర్నా నిర్వహించి సీహెచ్‌సీ సూపరింటిండెంట్ డాక్టర్ జి చంద్ర సావేరికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్.వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ, రాజమహేంద్రవరపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నడకతోనే ఆరోగ్యం



వనసమారాధనలో పెనుగొండ వాకర్స్ క్లబ్ సభ్యులు

పెనుగొండ: నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వాకర్స్‌క్లబ్ జిల్లా గవర్నరు జి రామరాజు అన్నారు. గురువారం పెనుగొండ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పంచాయతీ పార్కు వద్ద నిర్వహించిన వనసమారాధనలో పాల్గొని, వాకింగ్ ఉపయోగాలను వివరించారు. పురుషులతో పాటు, మహిళలను నడకకు పోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు పిల్లి సత్తిరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నిర్వహణ నిధుల పెంపు

భీమవరం: పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం నిధులు పెంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెంచిన మొత్తం డిసెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తుందన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5.45 పైసల నుంచి రూ.6.19 పైసలకు పెంచగా ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ. 8.17 పైసల నుంచి రూ.9.26 పైసలకు పెంచినట్లు వివరించారు. భోజన పథకం నిర్వాహకులకు గౌరవ వేతనం బిల్లులు అక్టోబర్ నెల వరకు ఖజానా శాఖకు పంపించామన్నారు. భోజన పథకం నిర్వహణ బిల్లులు ప్రభుత్వం నుంచి విడుదల కాగానే నిర్వాహకులకు చెల్లిస్తామని డీఈవో నారాయణ తెలిపారు.

రైతుల ఉరుకులు పరుగులు



మొగల్తూరు జాతీయ రహదారిపై ఆరబెట్టిన ధాన్యం



శేరేపాలెంలో కోసిన పనలను ఆరబెడుతున్న రైతు

మొగల్తూరు: ఈ ఏడాది సార్వా సాగు వాతావరణ పరిస్థితులు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. తాజాగా తుఫాన్ దెబ్బకు చేతికి వచ్చిన పంట నష్టపోతమేమోననే భయంతో రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు వాతావరణంలో మార్పులు కారణంగా రైతులు ఆందోళన చెందారు. భారీ వర్షాలు కురవకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మరలా మరోసారి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు మరోసారి ఆందోళనకు గురవుతున్నారు. ప్రతి ఏటా మొగల్తూరు మండలంలో సార్వా సాగు 4వేల ఎకరాలు, దాళ్వా సాగు 2వేల ఎకరాలలో సాగు అయ్యేది. అయితే పండిన పంట చేతికందకపోవడం, గిట్టుబాటు ధరలేకపోవడం, సాగు నీరందకపోవడం తదితర కారణాలతో వ్యవసాయం తగ్గిపోయింది. ఈ ఏడాది 1198 ఎకరాలలో సార్వా సాగు చేపడతారని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అయితే జూన్ నెలలో కాలువలు వదిలినా కాలువలో గుర్రపు డెక్క పెరిగిపోయి శివారు భూములకు సాగు నీరందకపోవడంతో సాగు పనులు చేపట్టడం ఆలస్యమైంది. అధికారులు అంచనా ప్రకారం ఇప్పటి వరకు కేవలం 45 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయని అధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా గత మూడు రోజుల నుంచి రైతులు వేగంగా వరికోతలు కోస్తున్నారు. ఈ నేపథ్యంలో పంట చేతికందిన రైతులు ధాన్యాన్ని జాగ్రత్తలు తీసుకునే ప్రయత్నంలో ఉండగా, మరి కొద్దిమంది రైతులు కోసిన పనలను బరకాలు వేసి కప్పే ప్రయత్నంలో పడ్డారు. మరో పదిహేను నుంచి ఇరవై రోజులు వాతావరణం సహకరిస్తే నష్టం నుంచి గట్టెక్కుతామని రైతులు పేర్కొంటున్నారు.